

అభిమానసంద్రం: నరసరావుపేటలో అనిల్‌కుమార్, డాక్టర్ గోపిరెడ్డిల నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ అభిమానులు



గెలుపు పక్కా: రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టేది తామేనని చెబుతూ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ ఫొటోతో ర్యాలీలో పాల్గొన్న యువతి



బుల్లెట్ స్పీడ్: నామినేషన్ వేసేందుకు బుల్లెట్ వాహనంపై వెళ్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్



ఇరుగుదిష్టి.. పొరుగుదిష్టి: నామినేషన్ వేసేందుకు తరలివెళ్తున్న అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డిలకు గుమ్మడికాయలతో దిష్టితీస్తున్న మహిళలు

క్లుప్తంగా

పేటలో ఏడు నామినేషన్లు దాఖలు

చిలకలూరిపేట: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆరో రోజైన బుధవారం ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మద్దుల రాధాకృష్ణ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నారదమునికి అందజేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు సతీమణి కావటి మాధవి నామినేషన్ దాఖలు చేశారు. నవతరం పార్టీ అభ్యర్థి రావు సుబ్రమణ్యం తన మూడో సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారికి అందించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా తుమ్మలూరి రమణయ్య రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పసుపులేటి శ్రీనివాసరావు నామినేషన్ అందించారు. బీఎస్పీ పార్టీ తరుపున కొప్పుల బాబురావు, రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ అభ్యర్థిగా షేక్ గౌస్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

నరసరావుపేటకు తరలిన పార్టీ శ్రేణులు



నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం నరసరావుపేటకు తరలివెళ్లారు. నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లకు పార్టీ జెండాలు కట్టుకుని, టోపీలు, టీ-షర్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మేజర్ పంచాయతీలైన గణపవరం, నాదెండ్ల, సాతులూరు నుంచి కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

నిబంధన... ఉల్లంఘన!



బొల్లాపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళి ప్రకారం పార్టీలకు సంబంధించి ప్రచార, ఇతరత్రా కార్యక్రమాల్లో పాల్గొనకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ కొందరు ఉద్యోగులు పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ విధేయతను చాటుకుంటున్నారు. బుధవారం ఆర్టీసీ ఉద్యోగి బాణావత్ సక్రూనాయక్ తెలుగుదేశం పార్టీకి సంబంధించి ఓ కార్యక్రమంలో పాల్గొన్న సంఘటన ఇది. బొల్లాపల్లి మండలం గండిగనుమల గ్రామానికి చెందిన ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి ఒకరు తెలుగుదేశం అభ్యర్థి జీవీ ఆంజనేయులు నామినేషన్‌కు కార్యకర్తలా గ్రామం నుంచి వినుకొండకు తరలివచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు, వేతనాలు పొందుతున్న వారు ఎవరైనా పార్టీలకు సంబంధించి ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొనకూడదనే నిబంధనలను భేఖతరు చేస్తున్నారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



వినుకొండ(నూజెండ్ల): ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు రూరల్ సి.ఐ సుధాకర్ అన్నారు. నూజెండ్ల మండలం పాత కొత్తపాలెం, కొండలరాయునిపాలెం గ్రామాల్లో పోలీసు బలగాలతో వీధుల వెంట కవాతు నిర్వహించారు. అనంతరం ప్రజనుద్దేశించి సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుచర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మీ నారాయణరెడ్డిలతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టండి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపు
- వేర్వేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



గ్రామంలో పాదయాత్రగా వస్తున్న వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ప్రజలు వైఎస్సార్ సీపీ ఆదరించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం త్రిపురాపురం, గొల్లపాలెం, కొత్తకొత్తపాలెం, పాత కొత్తపాలెం, కొండలరాయుని పాలెం, పువ్వాడ, ములకలూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఆయా గ్రామాల ప్రజలు అడుగడుగున ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేశామో ప్రజలు గమనించాలన్నారు. నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై రెండు బ్రిడ్జీల నిర్మాణం, ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో పాటు నాడు-నేడు నిధుల కింద పాఠశాలల అభివృద్ధి, గ్రామ సచివాలయాల నిర్మాణంతో పాటు వందల కోట్ల సంక్షేమం పథకాల రూపంలో ప్రజలకు మేలు చేకూర్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మండలాన్ని తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామన్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు అభివృద్ధి పనులను అడ్డుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని, టీడీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులకు కూడా రక్షణ ఉండద న్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు ఎలాంటి భయం లేకుండా వ్యాపారాలు చేసుకునేందుకు సహకరించామని, ముఖ్యమంత్రికి వస్తున్న ప్రజాదరణ చూసి ఒంటరిగా గెలిచే సత్తాలేక చంద్రబాబు, జనసేన, బీజేపీ పార్టీలతో అనైతిక పొత్తు పెట్టుకొని రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, ఎవరు ఎన్ని కూటములు వచ్చినా విజయం మాదేనన్నారు. వినుకొండలో మరోసారి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నరసరావుపేట ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

స్థానికులు రారని.. పొరుగు జిల్లా వారిని పిలిపించుకుని..



మహిళలకు డబ్బులు పంచుతున్న టీడీపీ నాయకులు



ప్రకాశం జిల్లా నుంచి ర్యాలీకి తరలివస్తున్న ప్రజలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఎన్నికల నామినేషన్ సందర్భంగా బల నిరూపణ కోసం పక్క జిల్లాల నుంచి కూడా డబ్బు, మద్యం పంపిణీ చేసి నామినేషన్ ర్యాలీకి తరలించారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, పుల్లలచెరువు, ముటుకుల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మహిళలను కూడా తరలించారు. ఇటీవల ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్ సందర్భంగా వేలాది మంది తరలిరావడంతో దిక్కుతోచని టీడీపీ నాయకులు పక్క జిల్లాల నుంచి ప్రజలను తరలించడం కేవలం బల నిరూపణ కోసమేనంటూ ప్రజలు చర్చించుకోవడం కనిపించింది. పట్టణంలోని శివారు కాలనీల్లో మహిళలకు సైతం డబ్బులు పంచి ప్రజలను తరలించారు.

సుభాష్.. శభాష్...

టెన్త్ ఫలితాల్లో మండలంలో వేల్పూరు విద్యార్థికి ప్రథమస్థానం



సాయి సుభాష్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి కష్టపడేతత్వం పట్టుదల క్రమశిక్షణతో పాటు దృఢసంకల్పం ఉంటే ప్రతిభకు అడ్డుకాదని నిరూపించి పదోవ తరగతి పరీక్షలో పల్నాడు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి తన సత్తా చూపాడు సుభాష్. వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి పరీక్షలు 588 మార్కులు సాధించిన పోత్తూరి భువన సాయి సుభాష్ మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించి అందరి మన్ననలు పొందాడు. పోత్తూరి వెంకట పూర్ణచంద్రరావు- కృష్ణవేణి దంపతులకు ఇద్దరు సంతానం కాగా ఇరువురును ప్రాథమిక దశ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించారు. ఈక్రమంలో ప్రాథమిక దశ నుంచి పోత్తూరి భువన సాయి సుభాష్ పోటీతత్వంతో చదువుతూ వివిధ రకాల అవార్డులు ప్రశంస పత్రాలు పొందాడు. విద్య పరంగా తన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సహకారంతో తాను ఈస్థాయిలోకి వచ్చినట్లు తెలిపారు. భవిష్యత్‌లో తాను సీఏ విద్యను అభ్యసించి విద్యపరంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రతిభ కల్గిన వారందరికీ ఆర్థిక భరోసా కల్పించాలన్నదే తన ధ్యేయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పోత్తూరి భువన సాయి సుభాష్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని,పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు, ఆర్యవైశ్య ప్రముఖులు ఆలపాటి సాంబశివరావు, గట్టుపల్లి వీరాస్వామి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

ఇనిమెళ్లలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకుల దాడి

ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఇరువురిపై టీడీపీకి చెందిన నాయకులు దాడిచేసి గాయపరిచారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వగ్రామంలో ఆయన నామినేషన్‌కు వినుకొండ తరలి వెళ్లే క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చింతల వీరాంజనేయులు ర్యాలీగా బయల్దేరారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన తమ్మిశెట్టి ఆంజనేయులు, అతని అనుచరులపై దాడిచేసి గాయపరిచారు. క్షతగాత్రులను వినుకొండలోని వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్ బాబు, ఈపూర్ ఎస్సై మొహమ్మద్ ఫెరోజ్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు.

శాంతియుత ఓటింగ్‌కు సహకరించాలి

ముప్పాళ్ల: గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ఓటర్లు సహకరించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు చెప్పారు. మండలంలోని మాదల, తొండపి, రుద్రవరం గ్రామాల్లో కేంద్ర అదనపు పోలీసు బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. గ్రామ స్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో యువత గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాలీలో ఎస్సై పి.హజరతయ్య, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



చిలకలూరిపేటలో కండువాలు కప్పుతున్న కావటి మనోహర్ నాయుడు



వినుకొండలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు

చిలకలూరిపేట: గతంలో అనేకసార్లు అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను, పార్టీశ్రేణుల్ని వంచించిన చంద్రబాబు కుటిల రాజకీయాలకు ఈసారి ఎన్నికల్లో స్వస్తి పలుకుదామని టీడీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు సమక్షంలో 40 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. పసుమర్రు గ్రామం 15వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు షేక్ సనావుల్లా, షేక్ జానీబాష, షేక్ ఖాదర్‌బాష, షేక్ గౌస్‌లాజంవలి, షేక్ మొహమ్మద్, షేక్ సుభాని, షేక్ హసన్ బుడే, జలగాల కోటితో పాటు 40 కుటుంబాల నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలతో పేదలకు మంచిభరోసా ఇవ్వడంతో పార్టీలోకి చేరామన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సేవలందించేందుకు అసెంబ్లీ పోటీబరిలో నిలిచిన కావటి విజయానికి అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు సమన్వయంతో సైనికుల్లా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో 16వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణంలోని 2వ వార్డు తెలుగుదేశం పార్టీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు భారీగా...



రొంపిచర్ల: మండల ప్రజలు నరసరావుపేటలో తమ అభిమాని నాయకులు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి బుధవారం తరలివచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి ప్రజలు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి తమ నాయకులకు మద్దతుగా నిలిచారు. వృద్ధులు, మహిళలు వాహనాల్లో రాగా, యువత సుమారు 2500 మోటార్ సైకిల్‌పై ర్యాలీగా వచ్చి తమ నాయకులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం గ్రామాల్లో పండుగ, తిరునాళ్ల సందడి నెలకొంది.

మాజీ ఎమ్మెల్యేల సమక్షంలో కోడ్ ఉల్లంఘన



ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొలగించి గజమాల వేస్తున్న టీడీపీ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు సాక్షిగా ఆ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు బుధవారం నామినేషన్ దాఖలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆ పార్టీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి ఉన్న ముసుగును ఆ పార్టీ నాయకులు తొలగించి గజమాల వేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులుకానీ, అధికారులుకానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆదరించండి...అభివృద్ధి చేస్తా..

- ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు
- 19వ వార్డులో కావటికి ఘనస్వాగతం
- ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: ప్రజలకు సేవ.. నియోజకవర్గం అభివృద్ధి చేసే భాగ్యాన్ని కల్పించాలని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు కోరారు. పట్టణంలోని 19వ వార్డులో సార్వత్రిక ఎన్నికల ప్రచార ప్రక్రియను బుధవారం నిర్వహించారు. వార్డు పర్యటనలో భాగంగా విచ్చేసిన కావటిని మహిళలు హారతులు ఇవ్వగా.. పార్టీ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వార్డులో జరిగిన అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు.

అలాగే స్థానిక సమస్యలను వార్డు ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలోని జన్మభూమి కమిటీలు, నాయకులు వారి ఆగడాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనకు తేడాను గమనించాలన్నారు. అర్హతే ప్రామాణికంగా ఎవరి సిఫార్సు లేకుండా సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అన్నారు. ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయాన్ని చేకూరుస్తాయన్నారు. ఒకవైపు సిద్ధం బహిరంగ సభలు, మరోవైపు మేమంతా సిద్ధం బస్సు యాత్రలతో రాష్ట్రమంతా ఫ్యాన్ గాలి బలంగా వీస్తున్నదని తేటతెల్లమైందన్నారు. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారం చేపట్టడం ఖాయమని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి వెల్లడించిన వివిధ సంస్థల సర్వేలే సాక్ష్యమన్నారు. ఫ్యాన్‌గాలి స్పీడ్ ముందు కూటమి కొట్టుకుపోవడం ఖాయమన్నా రు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను ఎంపీగా పి.అనిల్ కుమార్ యాదవ్ ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మరోమారు అభ్యర్థించారు.

కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి పఠాన్ తలహాఖాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బొల్లెద్దు చిన్న, తోట రాజేంద్రప్రసాద్, మాజీకౌన్సిలర్ గ్రంధి ఆంజనేయులు, పార్టీ నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రీ, అబ్బాస్‌ఖాన్, నాయకులు ఇక్కుర్తి పవన్, మారుబోయిన నాగరాజు, సయ్యద్ మస్తాన్‌వలి, సురేంద్ర, సయ్యద్ ఆలి, ఖాజా, మీరాబి, నాగూర్, శాంతి, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

చెరువు నిర్వహణకు సహకరించాలి

శావల్యాపురం: మండల కేంద్రంలోని మంచినీటి చెరువు నిర్వహణకు గ్రామస్తులు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర అన్నారు. స్థానిక గ్రామసచివాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మంచినీటి చెరువు పరిధిలో 400 ఇంటింటి నీటి కుళాయిలు ఉండగా ప్రతినెలా రూ.100 రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. నెలవారీగా చెల్లింపులు సకాలంలో చెల్లించకపోతే మంచినీటి చెరువు నిర్వహణ భారంగా మారుతుందన్నారు. గత నెలలో మంచినీటి చెరువులో సాగర్ జలాలు లేకపోవటం చేత నిలుపుదల జరిగినట్లు వెల్లడించారు. ప్రతినెలా విద్యుత్ బిల్లులు, నిర్వహణ ఖర్చు తదితరవన్నీ ఉందని వివరించారు.

రేపు రామాలయం పునః ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లులో రామాలయం పునః ప్రతిష్టా వేడుకలు ఈనెల 26న ఉదయం 10.26 నిమిషాలకు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కంతేరు వాస్తవ్యులు శ్రీ దిట్టకవి పురుషోత్తమచార్యులు, ఆలయ పూజారి కొడవటికంటి రంగా చార్యులు సారథ్యంలో సహచర పండితులు నిర్వహణలో ఈ వేడుకలు గ్రామస్తులు దాతలు సౌజన్యంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24 నుంచి 26 వరకు హోమాలు, విశేష పూజలు, తదితర ఘనంగా జరుగుతాయన్నారు. చివరిరోజు భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

70 శాతం మంచినీటి చెరువులు నింపాం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామం పరిధిలో ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు (ఏబీసీ) ఈనెల 27వరకు సాగర్ జలాలు విడుదల అవుతాయని ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు అన్నారు. మండలంలోని పిట్టంబండ మేజరు కాల్వను ఎన్నెస్పీ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఈనెల 12న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 1000 క్యూసెక్కులు సాగర్ జలాలు తాగునీటి అవసరాలు నిమిత్తం విడుదల చేయగా ఇప్పటి వరకు ఏబీసీ కెనాల్ పరిధిలో ఉన్న 23 మంచినీటి చెరువులు, నీటి కుంటలు, వాగులు తదితరవన్నీ 70 శాతం నింపినట్లు తెలిపారు. సాగర్ జలాలు దుర్వినియోగం కాకుండా ఉండటానికి రాత్రి సమయంలో ఎన్నెస్పీ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఏబీసీ కెనాల్ పరిధిలో 24 ఉండగా పిట్టంబండ, శానంపూడి మేజర్లు సాగర్ జలాలు విడుదల 250 క్యూసెక్కులు సాగర్ జలాలను విడుదల చేశామన్నారు. బాపట్ల జిల్లాకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. ఈనెల 27లోగా నూరుశాతం మంచినీటి చెరువులు నింపుతామని మరో మూడు నెలల వ్యవధి వరకు తాగునీటి సమస్య లేకుండా ఉంటుందన్నారు. ఆయనతో పాటు ఎన్నెస్పీ ఏఈ పోట్లూరు లక్ష్మీనారాయణ నందకిషోరు తదితరులు ఉన్నారు.